Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక



ప్రజా TV PRAJA TELEVISION The People's Favour

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..

మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541

సంప్రదించండి: 8309979541, 9494659622

ప్రజా టెలివిజన్

తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్



సంపుటి : 25 సంచిక : 162 హైదరాబాద్ బుధవారం 18 జూన్ 2025 పేజీలు : 8 వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR






# బనకచర్లపై చర్చిద్దాం రండి

## అన్ని పార్టీలనూ కలుపుకొని ప్రభుత్వ కార్యాచరణ

- నేడు అఖిలపక్ష ఎంపీలకు మంత్రి ఉత్తమ్ ప్రజంటేషన్
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ సహా ఎంపీలందరికీ ఆహ్వానం.. హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

ఏపీ చేపట్టిన గోదావరి – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు రాకుండా అడ్డుకునేలా అన్ని పార్టీలను కలుపుకొని కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో అన్ని పార్టీల ఎంపీలకు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఈ మేరకు రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ ఆహ్వాన లేఖలు పంపారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను గౌరవ అతిథులుగా

- మిగతా 2వ పేజీలో



# బాంబుల వర్షం

## ఇరాన్‌పై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్

- ఖమేనీ సన్నిహిత సలహాదారు మృతి.. టెహ్రాన్‌లో భయానక పరిస్థితులు
- నగరాన్ని వీడుతున్న జనం.. జీ7 నుంచి అర్ధంతరంగా వచ్చేసిన ట్రంప్
- కాల్పుల విరమణ కంటే మెరుగైన పరిష్కారం కోసం చూస్తున్నాం.. ఖమేనీ ఎక్కడున్నారో తెలుసని వ్యాఖ్య
- ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు
- ఉద్రిక్తతల తగ్గింపునకు ఐరోపా, అరబ్ దేశాల పిలుపు

ఐదో రోజైన మంగళవారం పరస్పరం జరుపుకొన్న దాడుల్లో 2 వైపులా భారీ నష్టం సంభవించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సన్నిహిత సలహాదారు మరణించారు. ఇజ్రాయెల్‌లోని మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై దాడిచేసిన ఇరాన్.. డ్రోన్ల తయారీ యూనిట్‌ను ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్‌లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు నగరాన్ని వీడుతున్నారు. ఇక జీ7 సదస్సులో పాల్గొనేందుకు కెనడా వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అర్ధంతరంగా వాషింగ్టన్ వచ్చేశారు. కాల్పుల విరమణ కంటే

- మిగతా 2వ పేజీలో

ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమైంది. ఇరు దేశాల దాడు లు, ప్రతి దాడులతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. యుద్ధ విమానాలతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. అటు ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపిస్తోంది.



## పీసీసీ అధ్యక్షుడికి కేటీఆర్ లీగల్ నోటీసులు

### ఆయనవి దిగజారుడు వ్యాఖ్యలని మండిపాటు

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా తనపై, తమ పార్టీ నేతలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం లీగల్ నోటీసులు పంపించారు. "హామీల అమలు చేతకాని కాంగ్రెస్ సర్కారు... తమ అసమర్థతను కప్పిపుచ్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాద్ధాంతం చేస్తోంది. చట్టాలను గౌరవించే వ్యక్తులుగా అక్రమంగా పెట్టిన కేసు విచారణకు సైతం హాజరై సహకరించాం. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదు. కేవలం రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే.. కోర్టుకు ఈడుస్తాం" అని కేటీఆర్ హెచ్చరించారు.



## బీసీ బిల్లు ఆమోదానికి జులై 17న రైలురోకో

### జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాతీర్పు ప్రతినిధి, మెదక్

బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం సరైన సమయంలో కొట్లాడితే శాసనసభలో రెండు బిల్లులు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని దిల్లీకి పంపి చేతులు దులిపేసుకుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ

- మిగతా 2వ పేజీలో

# గో సంరక్షణకు సమగ్ర విధానం

## వివిధ రాష్ట్రాల్లో అధ్యయనానికి త్రిసభ్య కమిటీ

### తొలి దశలో 4 అత్యాధునిక గోశాలలు.. సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

రాష్ట్రంలో గోవుల సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లో అధ్యయనానికి పశుసంవర్థక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గోసంరక్షణ కోసం తొలుత వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశువైద్య విశ్వవిద్యాలయం సమీపంలో అత్యాధునిక గోశాలలు ఏర్పాటు చేయాలన్నారు. గోసంరక్షణపై

- మిగతా 2వ పేజీలో



# వాంగ్మూలాల రూపంలో సాక్ష్యాలు

## ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ ముందుకు బాధితులు

- 618 మంది జాబితాలో కాంగ్రెస్, భాజపా అగ్రనేతలు
- ఆ పార్టీల కార్యాలయాల్లోని ఉద్యోగులు సైతం..
- ఈటలకూ పిలుపు.. 22న వస్తానన్న ఎంపీ



ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో బాధితులు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ముందు వరుస కడుతున్నారు. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, జర్నలిస్టుల ఫోన్లను స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు బృందం అక్రమంగా ట్యాప్ చేసినట్లు సిట్ గుర్తించిన నేపథ్యంలో వాంగ్మూలాల నమోదు ప్రక్రియ ఊపందుకొంది. మొత్తం 618 మంది బాధితులతో కూడిన జాబితాను సిద్ధం చేసిన సిట్.. సాక్షులుగా వారి వాంగ్మూలాలను రెండు రోజులుగా నమోదు చేస్తోంది. ఈ క్రమంలోనే పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలోని సిట్‌కు వాంగ్మూలమిచ్చారు. ఎన్నికల సమయంలో తనకు

- మిగతా 2వ పేజీలో



## 18,472 కి.మీ. గ్రామీణ రోడ్ల అభివృద్ధి

### రెండు రోజుల్లో హ్యామ్ విధానంపై మార్గదర్శకాలు: మంత్రి సీతక్క

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి చేపడుతున్న హ్యామ్ విధానంపై రెండు రోజుల్లో మార్గదర్శకాలను జారీచేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటకల అనుభవాలను అధ్యయనం చేసి హ్యామ్

- మిగతా 2వ పేజీలో

# 'తుక్కుగూడ డబుల్ ఇళ్ల' లబ్ధిదారుల జాబితా కొట్టివేత

## అధికారులు మార్గదర్శకాల్ని పాటించలేదు

### అర్హులైన పిటిషనర్లు, ఇతర స్థానికులకు 3 నెలల్లో ఇళ్లు ఇవ్వాలి: హైకోర్టు



ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మునిసిపాలిటీ పరిధిలోని మంకాళ్‌లో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లకు సంబంధించి 2023 సెప్టెంబరు 2న ప్రకటించిన లబ్ధిదారుల జాబితాను, ఇళ్ల కేటాయింపును హైకోర్టు కొట్టివేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని మలక్‌పేట్, చార్మినార్ తదితర ప్రాంతాలకు చెందిన వారికి ఇక్కడ ఇళ్లు కేటాయించడం చెల్లదని.. స్థానికులమైన తమకు అర్హత ఉన్నప్పటికీ ఇళ్లు కేటాయించడం లేదని పేర్కొంటూ ఐనాల లక్ష్మమ్మ మరో 13 మంది మంకాళ్ గ్రామస్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిన గ్రామానికి చెందిన వారన్నారు. భూసేకరణ ద్వారా 9.20ఎకరాలు స్థానిక పట్టాదారుల నుంచి సేకరించి, 2700 డబుల్ ఇళ్లు నిర్మించారని తెలిపారు. తాము ఇళ్ల కోసం ఎదురుచూస్తుండగా 2023 సెప్టెంబరు 2న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల జాబితా విడుదల చేశారని.. జీహెచ్‌ఎంసీ

- మిగతా 2వ పేజీలో

# బాంబుల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన పరిష్కారం కోసం చూస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. దీనిని బట్టి ఏదో జరగబోతోందని అర్థమవుతోందని పరిశీలకులు అంటున్నారు. మరోవైపు ఉద్రిక్తతల తగ్గింపునకు ఐరోపా, అరబ్ దేశాలు పిలుపునిచ్చాయి. ఇరాన్‌లో చిక్కుకున్న కొంత మంది భారత విద్యార్థులు మంగళవారం సరిహద్దులు దాటి ఆర్మేనియాలోకి వచ్చారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అత్యంత సీనియర్ సైనికాధికారి, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సన్నిహిత సలహాదారు అయిన అలీ షాద్మానీ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. గతంలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో సీనియర్ సైనికాధికారి అలీ రషీద్ మృతి చెందడంతో.. అలీ షాద్మానీని ఇటీవల సాయుధ దళాలకు నూతన నాయకుడిగా ఖమేనీ నియమించారు.

టెహ్రాన్ డౌన్‌టౌన్‌కు సమీపంలోని 3,30,000 మంది ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీ చేసింది. కోటి మంది జనాభా ఉండే ఈ నగరం నుంచి పలువురు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఇప్పటిదాకా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 224 మంది మరణించారు. 1,277 మంది గాయపడ్డారు.

టెహ్రాన్ గగన తలంపై పూర్తి నియంత్రణ సాధించామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఎప్పుడంటే అప్పుడు తమ యుద్ధ విమానాలు ఇరాన్ రాజధానిపై దాడులు చేయగలవని పేర్కొంది. 120 క్షిపణి ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేశామని తెలిపింది. టెహ్రాన్ విమానాశ్రయమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేసింది. అక్కడున్న రెండు ఎఫ్-14 యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. దీనికి సంబంధించిన వీడియోలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. దాడుల్లో ఇరాన్ ప్రత్యేక ఎలైట్ దళం కుడ్స్ ఫోర్స్‌కు చెందిన 10 కమాండ్ సెంటర్లు నాశనమైనట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇరాన్ బ్యాంకులపై ఇజ్రాయెల్ సైబర్ దాడులకు పాల్పడుతోంది. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ల్యాప్‌టాప్‌లపై ఇరాన్ పాక్షిక బ్యాన్ విధించింది.

### మొస్సాద్‌కు దెబ్బ

ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతి దాడులు చేస్తోంది. మంగళవారం దాదాపు 20 బాలిస్టిక్ క్షిపణులను టెల్ అవీవ్‌పై ప్రయోగించడంతో భారీ నష్టం సంభవించినట్లు సమాచారం. పలు భవనాలు, వాహనాలపై క్షిపణులు పడడంతో మంటలు ఎగసిపడుతున్నట్లు తెలిసింది. మొస్సాద్ ప్రధాన కార్యాలయంపైనా ఇరాన్ దాడులు చేసినట్లు తెలుస్తోంది. టెహ్రాన్‌లో మొస్సాద్ ఏర్పాటు చేసుకున్న డ్రోన్ ఫ్యాక్టరీని ధ్వంసం చేసింది. గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ సైనిక నిఘా కాంప్లెక్స్‌పైనా క్షిపణి ప్రయోగించినట్లు ఇరాన్ తెలిపింది. ఇప్పటిదాకా 370 క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇజ్రాయెల్‌లో 24 మంది మరణించగా.. 500 మందికిపైగా గాయపడ్డారు.



సోమవారం ఇరాన్ జరిపిన దాడుల్లో ఇజ్రాయెల్‌లోని హైఫాలోని చమురు శుద్ధి కేంద్రం ధ్వంసమైంది.

### అంతకు మించి..

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మరింత తీవ్రమవుతున్న వేళ అధ్యక్షుడు ట్రంప్ తన కెనడా పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని అమెరికా చేరుకున్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా మంగళవారం ఆయన కెనడాలోనే పర్యటించాల్సి ఉంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతమైతేనే యుద్ధం ఆగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ట్రంప్ హడావుడిగా అమెరికా వెళ్లడం ప్రాధాన్యంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ హడావుడిగా సిచువేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు వచ్చారు. రాగానే రక్షణ మంత్రి హెగ్సెత్‌తో భేటీ అయ్యారు. దీంతో ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో అమెరికా చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సిందే. ఇది సుమారు 13,600 కిలోల బరువుంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి-2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డీగో గార్సియా బేస్‌కు అమెరికా చేర్చింది. రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలనూ పశ్చిమాసియాకు తరలిస్తోంది. బ్రిటన్ తన ఫైటర్‌జెట్లను మోహరిస్తుండటం ఉద్రిక్తతను పెంచుతోంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక ప్రతినిధి విట్‌కాఫ్‌ను ఇరాన్‌తో చర్చల కోసం పంపుతానని ట్రంప్ తెలిపారు.

ఇజ్రాయెల్‌కే తమ మద్దతు ఉంటుందని జీ7 దేశాల కూటమి ప్రకటించింది. ఇరాన్ ఉగ్రవాద శక్తులను పెంచి పోషిస్తూ పశ్చిమాసియాలో అస్థిరతకు కారణమవుతోందని ఆరోపించింది. హర్మూజ్ జల సంధిలోని ఇరాన్, ఒమన్ తీరాల సమీపంలో3నౌకలు తగలబడుతున్నట్లు సమాచారం.

### అర్మేనియా చేరుకున్న భారతీయ విద్యార్థులు

ఇరాన్‌లో చిక్కుకుపోయిన 110 మంది భారతీయ విద్యార్థులు అర్మేనియా చేరుకున్నారని విదేశాంగశాఖ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. బుధవారం వారు దిల్లీకి రానున్నారని వెల్లడించింది. మరోవైపు టెహ్రాన్‌లోని భారతీయులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులందరూ సొంత మార్గాల్లో నగరాన్ని వీడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారత రాయబార కార్యాలయం మరో అడ్వైజరీ జారీ చేసింది.

### ఖమేనీ ఎక్కడున్నాడో మాకు తెలుసు: ట్రంప్

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని సూచించారు. 'ఖమేనీ మాకు సులభమైన లక్ష్యమే. అయితే ఆయనను ప్రస్తుతానికి చంపాలనుకోవడం లేదు. ప్రజలపైనా, అమెరికా సైనికులపైనా క్షిపణులను ప్రయోగించడాన్ని కోరుకోవడంలేదు' అని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికలో ట్రంప్ ప్రకటించారు.

# 'తుక్కుగూడ డబుల్ ఇళ్ల' లబ్ధిదారుల జాబితా కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చార్మినార్, చంద్రాయ ణగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లు కేటాయించారని వివరించారు. ఆ జాబితాను కొట్టేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకా రం అర్హత ఉన్న పిటిషనర్లు, స్థానికులకు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తర ఫు న్యాయవాదులు వాది స్తూ.. అవి జీహెచ్‌ఎంసీ పరిధిలోని పేదల కోసం నిర్మించామని, అయినప్పటికీ స్థానిక కోటా కింద కూడా కొన్ని ఇళ్లు కేటాయించామని తెలిపారు.

లబ్ధిదారుల జాబితా నిబంధనల ప్రకారమే ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ జీవో 10 ప్రకా రం చూసినా రూరల్ జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలకు 50%, మైనారిటీలకు 7%, మిగిలినవి ఇతరులకు కేటాయించాలని, అలాగే అర్బన్ జిల్లాలకు ఎస్సీలకు 17%, ఎస్టీలకు 6, మైనారిటీలకు 12%, మిగతావి ఇతరులకు కేటాయించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. 'ఒక నియోజకవర్గానికి కేటాయించిన ఇళ్లకు జిల్లా మంత్రి, ఎమ్మెల్యే 50:50 శాతం నిష్పత్తితో లబ్ధిదారులను ఎంపిక చేస్తారని జీవోలో ఉంది. సదరు లబ్ధిదారుల జాబితాలను స్థానిక తహసీల్దార్ లేదా జీహెచ్‌ఎంసీ అధికారులు తనిఖీ చేసి గ్రామసభ ఎదుట ఉంచాలి. సామాజిక, ఆర్థిక, కుల గణాంకాల ప్రకారం పరిశీలించి జిల్లా కలెక్టర్ లేదా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు పంపాలి. 2015లో జీవో 12, 2020లో జీవో 3 ద్వారా డబుల్ ఇళ్లకు సంబంధించి అదనపు మార్గదర్శకాలు విడుదల చేశారు. వాటి ప్రకారం కూడా స్థానికులకు వెయ్యి యూనిట్లు లేదా 10% కేటాయించాలని ఉంది. ప్రస్తుత కేసులో 14 మంది పిటిషనర్లు మహేశ్వరం నియోజకవర్గం/మండల పరిధికి చెందిన వారు. ఆ నియోజకవర్గానికి 400 ఇళ్లు కేటాయించారు. జీవో 3 ప్రకారం చూ సినా 10% లేదా వెయ్యి యూనిట్లు కేటాయించాలి. 2023 సెప్టెంబరు 2న లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తే ప్రభుత్వ అధికారులు మార్గదర్శకాలను పాటించలేదని స్పష్టమవుతోంది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు మార్గదర్శకాల ప్రకారం ఇళ్లే లభించలేదు' అని ధర్మాసనం పేర్కొంది. లబ్ధిదారుల జాబితాను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది. జీవోల ప్రకారం పిటిషనర్లు, ఇతర స్థానికుల అర్హతను పరిశీలించి 3 నెలల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పేర్కొంది.


### రంగారెడ్డి జిల్లాలో కొత్త జాబితాలు ప్రకటించాలి: వీరేందర్‌గౌడ్

తుక్కుగూడలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను బీఆర్‌ఎస్ సర్కారు జీహెచ్‌ఎంసీ పరిధిలోని వారికి కేటాయించడం అక్రమమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. అందుకే హైకోర్టు ఆ జాబితాను కొట్టివేసిందన్నారు. వాస్తవానికి తుక్కుగూడలో కట్టిన ఇళ్లలో ఏకంగా 89% అంటే 2,400 ఇళ్లను ముస్లింలు, అందునా స్థానికేతరులకు కేటాయించారని చెప్పారు. తుక్కుగూడ ప్రాంతంలో ముస్లింల జనాభా 50% కంటే ఎక్కువగా మారేలా వ్యవహరించారని, ఈ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. జీవోకు విరుద్ధంగా 89% ఇళ్లు ఒకే వర్గానికి ఎలా ఇచ్చారని కోర్టు ప్రశ్నించిందని వీరేందర్‌గౌడ్ చెప్పారు. ఈ తీర్పును బీజేపీ స్వాగతిస్తోందన్నారు. మొత్తం రంగారెడ్డి జిల్లాలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు జాబితాలన్నీ రద్దు చేసి, కొత్త జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# వాంగ్మూలాల రూపంలో సాక్ష్యాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎదురైన అనుభవాలను దర్యాప్తు అధికారులకు వివరించారు. తనతోపాటు కుటుంబసభ్యులు, సన్నిహితుల ఫోన్ నంబర్లపై నిఘా ఉంచిన ప్రభాకర్‌రావు బృందం.. క్షేత్రస్థాయిలో తమను ఎలా ఇబ్బందులకు గురిచేసిందో వాంగ్మూలం ద్వారా వెల్లడించినట్లు సమాచారం. శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, భాజపా అగ్రనేతలతోపాటు ఆయా పార్టీల రాష్ట్ర కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులపైనా ప్రభాకర్‌రావు బృందం అక్రమంగా నిఘా ఉంచినట్లు సిట్ గుర్తించింది. ఈ నేపథ్యంలో గాంధీభవన్, డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ భవన్‌లోని పలువురు ఉద్యోగుల వాంగ్మూలాలను నమోదు చేస్తోంది. గాంధీభవన్ సీపీఆర్వో హరి, ఎకౌంటెంట్ ప్రతాప్‌రెడ్డి, వార్‌రూం ఇన్‌ఛార్జి విజయభాస్కర్ ఫోన్లు ట్యాప్ అయ్యాయని మంగళవారం వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. భాజపా కార్యాలయంలోని ఉద్యోగులను త్వరలో పిలవనుంది. భాజపా నేత ప్రేమేందర్‌రెడ్డి ఫోన్ సైతం ట్యాప్ అయిందని ఆయననూ విచారణకు పిలిచారు. వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలంటూ భాజపా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను సిట్ కోరింది. ముందస్తు కార్యక్రమాల దృష్ట్యా ఈ నెల 22న వస్తానని ఆయన సమాచారమిచ్చినట్లు తెలిసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కుటుంబసభ్యుల వ్యాపార సంస్థల్లోని ఉద్యోగుల ఫోన్లు ట్యాప్ అయ్యాయని... వారినీ విచారణకు పిలవాలని సిట్ నిర్ణయించినట్లు సమాచారం.



### సీఎం కుటుంబసభ్యుల వాంగ్మూలాల నమోదుకూ అవకాశం

అప్పటి ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి కాల్ డిటెయిల్ రికార్డ్(సీడీఆర్)ను అక్రమంగా విశ్లేషించడంతోపాటు ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులు, డ్రైవర్లు, ఇంటి పనిమనుషుల ఫోన్లను ట్యాప్ చేశారని సిట్ గుర్తించింది. కామారెడ్డి ఎన్నికపై ప్రత్యేకంగా 'పోల్-2023' పేరిట వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి.. నిందితుడు మేకల తిరుపతన్న పర్యవేక్షణలోని బృందం ఎప్పటికప్పుడు విషయాలు చేరవేసుకుంటూ రేవంత్‌రెడ్డి సోదరులతోపాటు సన్నిహితులను లక్ష్యంగా చేసుకున్నారని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆధారాలు సేకరించిన సిట్.. వీరి వాంగ్మూలాలనూ నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది.

### ప్రభాకర్‌రావుతో ప్రణీత్‌రావు కన్‌ఫ్రంటేషన్ రేపు

ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన పోలీస్ అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్న.. అంతా ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే జరిగిందని వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఎస్ఐబీలోని డేటా ధ్వంసం చేయడంతోపాటు వీరంతా తమ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల్లోని డేటాను తొలగించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై స్పష్టతకు ప్రభాకర్‌రావుతో వీరి కన్‌ఫ్రంటేషన్(ముందుంచి విచారించడాని)కి అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే స్పెషల్ ఆపరేషన్ టార్గెట్(ఎస్‌వోటీ) పేరిట ప్రత్యేక విభాగాన్ని నడిపించిన ప్రణీత్‌రావును గురువారం ప్రభాకర్‌రావు ముందుంచి విచారించాలని సిట్ నిర్ణయించింది.





# బనకచర్లపై చర్చిద్దాం రండి

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించడంతోపాటు మంత్రి ఉత్తమ్ వారిద్దరికీ ఫోన్ కూడా చేశారు. బనకచర్ల ప్రాజెక్టును గట్టిగా ప్రతిఘటించడంతోపాటు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు ఇవ్వకుండా ఒత్తిడి తెచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. ఈ ఏడాది జనవరిలోనే కేంద్రానికి లేఖ రాశాం. దీనికి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ స్పందించి.. మే 28న రాష్ట్రానికి లేఖ రాశారు. బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ కేంద్ర ప్రభుత్వానికి అందలేదని తెలిపారు. అందితే నీటి కేటాయింపుల్లో ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, ట్రైబ్యునల్ తీర్పులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలతోపాటు రాష్ట్ర విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ డీపీఆర్‌ను సమీక్షిస్తామని పేర్కొన్నారు. తర్వాత జూన్ 3న సీఎం, నేను దిల్లీలో సీఆర్ పాటిల్‌ను కలిసి మరోసారి అభ్యంతరాలను లేవనెత్తాం.

ఈ నెల 13న మరోమారు నేను లేఖ రాశాను. సీడబ్ల్యూసీ అనుమతులను నిలువరించాలని డిమాండ్ చేశాను. ఈ క్రమంలో భవిష్యత్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు అన్ని పార్టీల ఎంపీలతో సమావేశానికి ఏర్పాట్లు చేశాం" అని పేర్కొన్నారు. 19న కేంద్ర మంత్రితో ఉత్తమ్ భేటీ: బనకచర్ల ప్రాజెక్టుపై ఈ నెల 19న కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో మంత్రి ఉత్తమ్ దిల్లీలో సమావేశం కానున్నారు. ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఏపీ ముందుకు వెళ్తుండటం, ఇటీవలి సమావేశాల్లో కేంద్ర సంస్థలకు చెందిన పలువురు అధికారులు చేసిన వ్యాఖ్యలపై పాటిల్‌కు వివరించనున్నట్లు తెలిసింది.

## బీసీ బిల్లు ఆమోదానికి జులై 17న రైలురోకో

(మొదటి పేజీ తరువాయి)

కల్వకుం ట్ల కవిత ఆరోపించారు. మంగళవారం మెదక్‌లో తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫులే ఫ్రంట్‌ల సంయుక్తాధ్వర్యంలో బీసీ రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ... "కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ సాధించే వరకు వదిలిపెట్టబోం. బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు తెలంగాణ ఉద్యమం తరహాలో ధర్నాలు, వంటావార్పు చేపట్టాలి. దిల్లీకి సెగ తగిలేలా జులై 17న రాష్ట్రవ్యాప్తంగా రైలురోకో చేపట్టాలి. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగంలో హక్కులుండటంతో వారు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నారు. హక్కులు లేని కారణంగానే బీసీలలో కొన్ని కులాల వారు ఇప్పటికీ వార్డు సభ్యులుగా, సర్పంచులుగా, ఎమ్మెల్యేలుగా కూడా కావడంలేదు. బీసీల రిజర్వేషన్లకు ఆమోదం లభించకముందే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తోంది. ఇది సరికాదు. రాష్ట్రంలో 56% ప్రజానీకం హక్కులు కోరుతున్నారు" అని స్పష్టంచేశారు. సమావేశంలో యునైటెడ్ ఫులే ఫ్రంట్ కన్వీనర్ శివశంకర్, తెలంగాణ జాగృతి నేతలు రంగు నవీన్‌ఆచారి, సంపత్‌గౌడ్, ఈగ సంతోష్, నరేందర్‌యాదవ్, లింగం, ఆనంద్, లలితయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గో సంరక్షణకు సమగ్ర విధానం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి మంగళవారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. "మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలకు అనుగుణంగా వాటి సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన జరగాలి. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులను దానం చేస్తున్నారు. స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయి. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మిస్తాం. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలి. భక్తులు సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధతో వ్యవహరించాలి. గోసంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదు" అని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గోశాలల ఏర్పాటుపై విధానపత్రాన్ని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి అధికారులు సీఎంకు అందజేశారు. సబ్యసాచి ఘోష్, శైలజా రామయ్యర్, రఘునందన్‌రావు, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18,472 కి.మీ. గ్రామీణ రోడ్ల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

విధానాన్ని మన రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు. ఈ శాఖపై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణం, ఇందిరా మహిళాశక్తి, స్త్రీ నిధి, మిషన్ భగీరథ, ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "హ్యామ్ విధానం ద్వారా గ్రామీణ రోడ్లకు మహర్దశ పడుతుంది. ప్రతి పల్లెలో రోడ్లు మెరిసిపోతాయి. మొత్తం 18,472 కి.మీ. మేర రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. మొదటి విడతలో 7,947 కి.మీ. మేర నవీకరిస్తాం. వీటికి 15 రోజుల్లో టెండర్లు వేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలి. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలు ఎన్నో పరిష్కరించాం. 93 వేల మంది గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నాం. ఎంపీడీవోల బదిలీల దస్త్రం సీఎం వద్ద, వారి వాహనాల అద్దెభత్యం ఫైల్ ఆర్థికశాఖ వద్ద ఉన్నాయి. త్వరలోనే వీటికి అనుమతులు వస్తాయి. త్వరలో పనుల జాతరను ప్రారంభిస్తాం. ప్రతి మండలానికి 2 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1,440 గ్రామ పంచాయతీ భవనాలను, 1,440 అంగన్‌వాడీ భవనాలను ఈ ఏడాది నిర్మిస్తాం. శాఖలోని ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను రూపొందించుకొని పనిచేయాలి" అని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగు బిల్లులను త్వరలో విడుదల చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం (టీపీఎస్‌ఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, నేతలు అరుణ్, వాణి తదితరులు సోమవారం మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం టీపీఎస్‌ఏ ప్రతినిధులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

# బెల్లంపల్లి పట్టణంలోని 13 వ వార్డ్ లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

- ఇంద్రమ్మ ఇండ్లకు ముగ్గు పోసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

**మంచిర్యాల జిల్లా ప్రజాతీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 17**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం లోని 13 వార్డులో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ అనంతరం ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటికల నెరవేరుస్తున్నాం అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నాం నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేసాం ఇది నిజమైన ఇందిరమ్మ రాజ్యం ఇక్కడ ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుంది ఇంటి కోసం ఎదురు చూస్తున్న పేదలకు ఇంటి పట్టాలు వారి కలలను సహకారం చేస్తున్నాయి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆశ్రయమైన ఇంటిని కల్పించడంలో ఎంతో కృషి చేస్తుందని అన్నారు ఇందులో ఒక్కో ఇంటికి 5 లక్షల చొప్పున 4 విడతలలో నేరుగా



లబ్ధిదారుల ఖాతలలో జమ చేయనున్నట్లు తెలిపారు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా అత్యంత పారదర్శకంగా జరిగిందని అన్నారు అధికారులు గ్రామాలలో లబ్ధిదారులను గ్రామస్తులను వెంటబెట్టుకొని ఒక్కింటికి రెండుసార్లు సర్వే చేసి ఎంపిక చేశారని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ , రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు



## అత్తపై దాడి చేసిన అల్లునికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 17**

అత్తపై దాడి చేసిన కేసులో అల్లునికి మూడు (3) సంవత్సరాల జైలు శిక్షతో పాటు 2000/-రూపాయల జరిమానా విధిస్తూ రాజన్న సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పువెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.వివరాల మేరకు...బోయవాడ కరీంనగర్ కు చెందిన రాపోలు శశికళ అనుఆమె వృద్ధాప్యం వల్ల సిద్దుల వాడ సిరిసిల్లలో తన కూతురు వద్దనే ఉంటుంది. తేదీ.09.05.2017 వ రోజున ఉదయం నుండి నన్ను తిట్టుచు ఇబ్బంది పెట్టుచు సాయంత్రం అందాల ఏడు గంటలకు వాళ్ళ ఇంటి ముందర గద్దెపై కూర్చొని ఉండగా చేతులతో కొట్టి కళ్లతో తన్ని పిడికిలితో నా ఎడమ చేయిపై మరి ఎడమ దవడపై ముక్కు ,నోటిపై , దాడిలో చెవి, నోటి, ముక్కు నుండి రక్త గాయాలు అయ్యాయి. సిరిసిల్ల పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినారు అప్పటి ఎస్ఐ మాచినేని రవి ప్రేమ్సాగర్ రావు మీద కేసు నమోదు చేసినారు దర్యాప్తు అనంతరం దర్యాప్తు అధికారి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ.శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ నరేష్ కోర్టులో ఆరు మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ నేరం రుజువు కావడంతో నింధితుడైన కర్మ బత్తుల ప్రేమ్ సాగర్ రావుకి ఒక మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రెండువేల రూపాయల జరిమానా విధించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.



## ఇందిరమ్మ లబ్ధిదారులకు,కమిటీ సభ్యులకు,మేస్త్రీలకు అవగాహన సదస్సు...

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి, కలెక్టర్ శ్రీమతి సత్యశారద**

**నర్సంపేట జూన్ 17 (ప్రజా తీర్పు)**

నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు,కమిటీ సభ్యులకు,మేస్త్రిలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి,కలెక్టర్ సత్యశారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నేటికి 3176 ఇండ్లకు మంజూరు పత్రాలు ఇచ్చామని తెలిపారు.మరో 3,000 ఇండ్లు త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు.ఇండ్ల నిర్మాణానికి మొరం(మట్టి) సమస్య లేకుండా లబ్ధిదారులు తహసీల్దార్లకు దరఖాస్తు పెట్టి అనుమతి తీసుకొని మొరం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.మేస్త్రిలకు అధిక మొత్తంలో ఉపాధి దొరుకుతుందని, వారు కూడా లబ్ధిదారులకు ఇబ్బందులకు గురి చేయకుండా లబ్ధిదారులకు,ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ వెంట వెంటనే విడతల వారీగా బిల్లులు మంజూరు అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి,ఎమ్మెల్యే కు వారు కృతజ్ఞతలు తెలిపారు.



## రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 17**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని రెండు కోట్లతో నిర్మించే గాంధీ విగ్రహం నుండి పోచమ్మ టెంపుల్ వరకు రెండు వరుసల బీటీ రోడ్ నిర్మాణ పనులకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తి లో కోటి రూపాయలతో సిమెంట్ రోడ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మున్సిపల్ కార్యాలయం నుండి ఏఎంసి చౌరస్తా వరకు రెండు కోట్ల రూపాయలతో రోడ్డు వెడల్పు మరియు సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరి ని మర్యాదపూర్వకంగా కలిసిన యలమంచి ఉదయ్ కిరణ్, టీం

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**



తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు మరియు యువజన శాఖల నూతన మంత్రి వాకిటి శ్రీహరి ని మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్, టీం సభ్యులు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి ని శాలువాతో ఘనంగా సత్కరించి, సౌహార్ధపూ ర్వకంగా అభినందనలు తెలిపారు.ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, యువతకి రాజకీయ అవకాశాల కల్పన తదితర అంశాలపై చర్చ జరిగింది. యలమంచి ఉదయ్ కిరణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. “సమాజం లోని అన్ని వర్గాలకు న్యాయం కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పని చేయాలి. యువతకు రాజకీయ, ఆర్థిక రంగాలలో అవకాశాలు కల్పించగలగాలి” అని పేర్కొన్నారు.

## అంకుసాపూర్ మాజీ ఎంపీటీసీ ఆత్మహత్య

**నా చావుకు కు కారణం గంగా క్రిష్ణరెడ్డి**

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ తంగళ్ళపల్లి జూన్ 17**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుశాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. కరికబోయిన కుంటయ్య(50)అనే వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ గంగా క్రిష్ణరెడ్డి 10 లక్షల భూమి కబ్జా చేసినాడని, కబ్జా చేశాడు అని అదే వ్యక్తి ఫోటో వెనకాల సూసైడ్ నోట్ రాసి అర్ధ రాత్రి 12:45 గంటలకు స్టేటస్లో ఆత్మహత్య చేసుకున్నట్లు వాట్సప్ స్టేటస్ లో పెట్టానని చెప్పాడు. కుంటయ్య వాట్సాప్ స్టేటస్ చూసిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పోలీసు స్టేషన్ కి సమాచారం అందించగా సెల్ఫోన్ లొకేషన్ ఆధారాలతో ఘటన స్థలానికి చేరుకొని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న అతనిని మొదట సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించిన చికిత్స అందించగా మెరుగైన వైద్యం కోసం మంగళవారం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులతో తెలిపారు. మృతుడు కుంటయ్య చనిపోయే ముందు



ఓ లేఖ రాశాడు నేను “లిక్కిడి గంగ కృష్ణారెడ్డి కబ్జా చేసినాడు మల్యాల నాగరాజు మాదిగ వీళ్ళిద్దరూ నన్ను చాలా ఇబ్బందిలు పెట్టినారు గంగా కృష్ణారెడ్డి మా ఇంటి మీదకి రెండుసార్లు కొట్టడానికి వచ్చినాడు.మళ్లీ ఊళ్లో కేసు పెట్టినాడు.ప్లాట్ కబ్జా చేశారని పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోగా తిరిగి తనపై కేసులు నమోదు చేశారని,ఇక్కడ ఫ్లాట్ లేదు అక్కడ ప్లాటు లేదు నా బిడ్డ పెళ్లి చేయడానికి నా దగ్గర ఏమీ లేదు వీరి మీద యాక్షన్ తీసుకొని నా కుటుంబానికి సాయం చేయగలరు కేటీఆర్ జై తెలంగాణ” ఫోటో కవర్ పై రాసిన కుంటయ్య ఆత్మహత్య చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య విజయ,భార్గవి, దీక్షిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.



## భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి

**బిజెపి కోహెడ మండల శాఖ అధ్యక్షులు జాలిగాం రమేష్**

**( ప్రజాతీర్పు ప్రతినిధి కోహెడ జూన్ 17)**

భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా డబ్బు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ కోహెడ మండల శాఖ అధ్యక్షుడు జాలిగా%శీ% రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యాసంగిలో 4ఎకరాల వరకు ఉన్న రైతులకు మాత్రమే ఇచ్చిన రైతు భరోసా ఆపైన ఉన్న రైతులకు ఎందుకు ఇవ్వలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 15 వేలు ఇస్తామని చెప్పిన రైతు భరోసా 12 వేలతోనే సరిపెట్టడం ఎంతవరకు సమంజసమని రమేష్ ప్రశ్నించారు. ఈసారైనా భూమి ఉన్న రైతులందరికి రైతు భరోసా ఇస్తారా? లేక యాసంగిలో చేసినట్టే 4.ఎకరాల వరకే పరిమితం చేస్తారా తేటతెల్లం చేయాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల స్టంట్ గా చేయవద్దని భూమి ఉన్న ప్రతి రైతుకు రైతుభరోసా ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.యాసంగి లో రైతు భరోసా రాని రైతులకు యాసంగితో పాటుగా నేడు ఇస్తున్న రైతుభరోసా కలిపి ఇచ్చి రైతులను పంట పెట్టుబడి సహాయంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రమేష్ డిమాండ్ చేశారు.

## నగర పరిశుభ్రత – మన అందరి బాధ్యత

- గోపినగర్ బస్తీ ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య పనుల కార్యక్రమం.. ప్రారంభించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్..

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

బహిరంగ ప్రదేశంలో చెత్త వేయటం చట్టరిత్య నేరం, మనమందరం కలిసి బస్తీని పరిశుభ్రంగా మారుద్దాం. మనం మారుదాం - మన నగరాన్ని మారుద్దాం అనే నినాదంతో శేరిలింగంపల్లి డివిజన్ లోగల గోపినగర్ లో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి పారిశుధ్యం అవగాహన సదస్సు ,(శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీలలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడానికి ప్రత్యేక వాహనాలు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని అన్నారు. మురుగునీటి వ్యవస్థను శుభ్రం చేయడం, మరమ్మతులు చేయడం, అవసరమైతే కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. దోమల నివారణకు మందులు చల్లడం, నీటి నిల్వలను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారిశుధ్యం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ, పరిశుభ్రత




పాటించేలా అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, ప్రజారోగ్యాన్ని కాపాడటం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు యాదా గౌడ్, నర్సింహ గౌడ్, పురం విష్ణువర్ధన్ రెడ్డి, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, రాజ్ కుమార్, శ్రీకాంత్, ఎస్.ఆర్.పీ బాలరాజ్, నర్సింహా, మల్లేష్ యాదవ్, పెంటయ్య, సాయి, షైబాజ్, పారిశుధ్య సిబ్బంది, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా పైప్ లైన్ రోడ్డులో పర్యటించిన జి.హెచ్.ఎం.సి కమిషనర్ కర్ణణ్ ,జగదీశ్వర్ గౌడ్ లు...

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ తో కలిసి మంజీర రోడ్డులో పర్యటించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్.. హాఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని మంజీర రోడ్డు,మదీనగూడా ఈర్ల చెరువు ను డి.సి మోహన్ రెడ్డి ,జిహెచ్ఎంసీ ఇంజినీరింగు ఎస్సీ శంకర్ నాయక్ ,డిఈ శ్రీదేవి,ఏఈ ప్రతాప్,ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు .ఏ.రేవంత్ రెడ్డి , మంత్రివర్యులు.దుద్దిల శ్రీధర్ బాబు .పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ శ్రీమతి.గద్వాల్ విజయలక్ష్మి నేతృత్వంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు నగర్ అభివృద్ధికి నిరంతరం చర్చిస్తూ,హైదరాబాద్ నాలుదిక్కుల చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిరంతరం జోన్ పరిధిలో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.. కాంగ్రెస్ పార్టీకి జీ.హెచ్.ఎం.సి అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందని,శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై పక్క ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగు తుందని, డివిజన్ల పరిధిలో పెండింగులో ఉన్న పనులు సంబంధిత అధికారులతో కలిసి పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ . నిత్యం రద్దీగా ఉండే మంజీర రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని,ఇప్పటికే నియోజకవర్గ



పరిధిలోని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను స్టాండింగ్ కమిటీలో చర్చించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బలింగ్ యాదగిరి గౌడ్, డివిజన్ అధ్యక్షురాలు శ్రీమతి రేణుక, రమణమూర్తి, కనకమామిడి నరేందర్ గౌడ్, శేఖర్ ముదిరాజ్, రవికుమార్, కరుణాకర్ గౌడ్, సంగారెడ్డి, పద్మ రావు, కనకారెడ్డి, కృష్ణ, శరత్, ప్రశాంత్,వినయ్,కార్తిక్ గౌడ్, ఆంజనేయులు, బంగారుబాబు, ఆంజనేయులు, సాయియాదవ్, మల్లేష్, దయాకర్రెడ్డి, వెంకట్రామిరెడ్డి, లక్ష్మణ్,నర్సింగ్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

# దుమాల గురుకుల పాఠశాల ముందు ధర్నా

- 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాం మమ్ములను ఎలా తొలగిస్తారు
- ఆవేదన వ్యక్తం చేసిన ఔట్సోర్సింగ్ కాంట్రాక్టర్లు
- నా చేతిలో ఏం లేదని చేతులు దులిపేసిన ఇంచార్జ్ ప్రిన్సిపల్

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్, ఎల్లారెడ్డిపేట జూన్ 17**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గురుకుల ఏకలవ్య మోడల్ స్కూల్ ముందు ఔట్సోర్సింగ్ కాంట్రాక్టర్ ఉద్యోగులు ధర్నా చేసి నిరసన చేశారు. ల్యాబ్అసిస్టెంట్ నిర్మల, కుకింగ్ మాస్టర్ బాలు, ఏఎన్ఎం సుజాత లు గత 15 సంవత్సరాలుగా గురుకుల పాఠశాల విధిని నిర్వహించారు. నూతనంగా వచ్చిన ఇంచార్జ్ ప్రిన్సిపల్ మంజిత్ మేము ఏ తప్పు చేయకుండా అకారణంగా మమ్ములను తొలగించి వేధింపులకు గురి చేస్తున్నాడని పురుగుల మందు డబ్బాతో పాఠశాల గేటు ముందు మంగళవారం సాయంత్రం నిరసన చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ సిబ్బంది యుక్తంగా వెళ్లి వారి అడ్డుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ.. మేము ఈ పాఠశాలలో గత 15 సంవత్సరాలుగా వివిధ హోదాలో పని చేస్తున్నామని, ఇటీవల నూతనంగా వచ్చిన ప్రిన్సిపల్ కొత్త కొత్త రకాల వంటలు చేయమని వేధింపులకు గురి చేసాడని అన్నారు. 15 సంవత్సరాలుగా మేము ఇక్కడ విధులు నిర్వహించామని,ఎప్పుడు కూడా మేము ఒక చిన్న తప్పు కూడా చేయలేదని ఒకవేళ తప్పు చేసినట్లయితే గతంలో ఉన్న ప్రిన్సిపాల్ మమల్ని తొలగించే వారిని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు యధావిధిగా గురుకుల పాఠశాలలో విధుల్ని ఇచ్చేవరకు పాఠశాల ముందు నిరసన చేస్తామని అన్నారు. ఇట్టి విషయాన్నికై ప్రిన్సిపల్ వివరణ కోరగా ఈ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలపై మాకు ఎలాంటి స్పష్టత ఉండదని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఈ ఉద్యోగులపై ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఉంటుందని కావున వీరు నేరుగా జిల్లా కలెక్టర్ కి దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూ ద్వారా ఈ ఉద్యోగాలకు నియామకాలు ఉంటాయని పేర్కొన్నారు.



## బిసి రిజర్వేషన్ లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీసీలంతా మహాదీక్షకు తరలిరావాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వలస సుభాష్

**(ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ జూన్ 17 )**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి వలస సుభాష్ కోరారు. దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మేమెంతో మా వాటా అంతా ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్ శాతాన్ని 42% అసెంబ్లీ లో తీర్మానం చేయడం శుభపరిణామం అని ఆచరణలో మాత్రం రిజర్వేషన్ లపై నిర్లక్ష్యం చేస్తే గుణపాఠం తప్పదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పోరాడి 9 షెడ్యూల్లో చేర్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచేందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న ఇందిరా పార్కు ధర్నా చౌక్ దగ్గర మహా దీక్ష చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ దీక్షకు బీసీ కుల సంఘ నాయకులు అధిక సంఖ్యలో రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో బీసీలమంతా ఏకమై గ్రామ గ్రామాన ఉద్యమం చేపడతామని సుభాష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 90 శాతం ఉన్న వెనుకబడి వర్గాలు రాజ్యాధికార స్థానంలో వారి స్థానం ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. ఉద్యమాల ద్వారానే హక్కుల సాధించుకోవడం జరుగుతుందని పోరాటానికి బీసీలందరం ఐక్యతతో ముందుకు వెళ్దామని వలస సుభాష్ చంద్ర బోస్ నేత పిలుపునిచ్చారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది**

**నర్సంపేట జూన్ 17 (ప్రజాతీర్పు)**



తెలంగాణ భవన్లో ప్రెస్మీట్ నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్థానికసంస్థల ఎన్నికలు తప్పనిసరి పరిస్థితుల్లో ఓట్ల కోసం రైతు భరోసా పేరిట నాటకానికి తెరతీశారు రైతు భరోసా స్థానిక సంస్థల స్టంట్ మాత్రమే అని తెలిపారు కేసీఆర్ హయాంలో రైతు భరోసా ఎలా వచ్చేదో.. ఇప్పుడు ఎలా వస్తోందో.. రైతులు ఆలోచించుకోవాలి గ్రామాలు వల్లకాడు అయ్యాయి.. కాంగ్రెస్ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఏ మొహం పెట్టుకొని వెళ్తారు అన్ని రకాలుగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్లు ఎలా అడుగుతరు స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే కాంగ్రెస్ నేతలను అడుగడుగునా నిలదీయాలి ఎకరాకు రూ. 25 వేల బకాయిలు ఇచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రానివ్వవద్దు కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు ఇచ్చేవారు రేవంత్ రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇస్తున్నారు రైతులకు ఒక్కో ఎకరాకు రేవంత్ రెడ్డి రూ.25 వేలు బాకీ ఉన్నారు సర్పంచుల పాత బిల్లులకు తమకు సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి విడ్డూరంగా మాట్లాడారు కేసీఆర్ ప్రాణాన్ని పణంగా పెట్టి తీసుకొచ్చిన తెలంగాణతో,ఆయన కట్టిన సచివాలయంతో రేవంత్ రెడ్డికి ఏం సంబంధం? రేవంత్ రెడ్డి తెలంగాణ పాలకుడు కాదు,కాజాలరు ధాన్యం కొనుగోళ్ల విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పేది శుద్ధ తప్పు అని అన్నారు పంటల కొనుగోళ్ల విషయంలో రైతులు ఈసారి పడిన ఇబ్బందులు ఎప్పుడూ పడలేదు పంటల కొనుగోళ్ల పేరిట కాంగ్రెస్ కార్యకర్తలు రైతుల నుంచి దోపిడీకి పాల్పడ్డారు కొనుగోలు కేంద్రాల నిర్వహణ పేరిట రూ.1,500 కోట్ల దోపిడీకి కాంగ్రెస్ పాల్పడింది. అణువణువునా కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తోంది ఈ పంట కాలంలో రైతులకు ఒక్క క్వింటాలుకు కూడా బోనస్ ఇవ్వకుండా బోగస్ చేశారు ధాన్యం టెండర్ల కుంభకోణంలో సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో నేను పిల్ దాఖలు చేస్తే. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా తప్పించుకుంటోంది. తప్పు చేయకపోతే ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా 16 వాయిదాలు ఎందుకు తీసుకొంది?రైతుల ఉసురు సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి ఉత్తమ్కు తగలక తప్పదు తెలిపారు

## బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం....

**(ప్రజా తీర్పు ప్రతినిధి జమ్మికుంట): జోన్ :17: మంగళవారం:**



బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో, అమృత న్యూరో ఆస్పత్రి వైద్యులు మంగళవారం రోజున మడిపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా. డాక్టర్ రాజేందర్ కందికొండ. మాట్లాడుతూ. ...వ్యాధులు సోకిన తర్వాత వైద్యానికి వచ్చే కంటే వ్యాధుల నివారణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా వైద్య పరీక్షలు చేసుకోవడం వల్ల వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించడం వల్ల ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్లను నివారించవచ్చునని అన్నారు. ఒక మనిషి సగటున రోజుకు ఐదు గ్రాముల కంటే తక్కువ ఉప్పు తినాలని, జాతీయ పోషకాహార సంస్థలు సూచిస్తున్న కూడా ప్రజలు పెడచెవిన పెడుతున్నారని రోజుకు( 12) గ్రాముల కంటే ఉప్పు తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు, గుండె జబ్బులు, గుండెపోటు, మూత్రపిండాల సమస్యలు అధికం అవుతున్నాయని తెలిపారు. బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ... మహిళలు చైతన్యవంతం అయినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఆవిర్భవిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సదానందం, బాలవికాస కోఆర్డినేటర్ ఆసియా, అమృత న్యూరో హాస్పిటల్ మేనేజ్మెంట్ కిరణ్,%ా.=.ా% శ్రీకాంత్, స్టాప్. పూజ, సుప్రతిక, శ్రావణి, రాజు, అన్వేష్ , మడిపల్లి గ్రామ కార్యదర్శి అంజిరెడ్డి గ్రామస్తుల తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# భూమిని సేద్యం చేసి ప్రజలకు ఆహార దాన్యాలు అందిస్తున్న రైతే-రాజు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 17,**



అర ఎకరం నుంచి 5 ఎకరాల భూమి కలిగిన సన్నకారు రైతులకు వ్యవసాయ సమయంకు పెట్టుబడులు ఎంతో అవసరం. అలాంటి సమయంలో సన్నకారు ప్రతి రైతన్నకు మేమున్నం భయపడకు అంటూ రైతుభరోసా పథకం ను కలిపిస్తున్న రాష్ట్రం ప్రభుత్వంకు ధన్యవాధములు. అదే విధంగా సన్నకారు రైతులకు నిత్యావసర సరుకులు ప్రభుత్వ పథకాలతోనే రాష్ట్ర ప్రభుత్వ ఇవ్వాలి. అలాగే సన్నకారు రైతుల కుటుంబంలో పుట్టిన బిడ్డలకు నర్సరీ నుండి బాచిలర్ డిగ్రీ వరకు ఉచిత విద్యను అభ్యసించుటకు (ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను కలిపించి) ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలి. ప్రత్యేక గుర్తింపు కార్డులు కలిగిన విద్యార్థులకు ఉపాధిని ప్రభుత్వమే కలిగించాలి. ఉపాధి వారికి లభించే వరకు ఆరోగ్య పరంగా ఉచిత వైద్యసౌకర్యలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. కానీ, భూములు కలిగిన ఉద్యోగులకులకు ఉద్యోగ భద్రత తో పాటుగా, ఉద్యోగి, స్పౌజ్, పిల్లల పేరున భూములున్నా రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వముకు ఎందుకు అనిపిస్తుంది. అలాగే 5 ఎకరాల నుంచి 25 ఎకరాలకు పైగా భూములు కలిగిన రైతులు – మోతుబరి రైతులు, వారు సామాన్య రైతులకన్నా మెరుగైన జీవితాలను గడుపుతున్నారు. సన్నకారు రైతులతో పాటుగా రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వముకు ఎందుకు అనిపిస్తుంది. కౌలు భూమిలో కష్టపడి వ్యవసాయ చేసి ఆహార ధాన్యాలు అందిస్తున్న సన్నకారు రైతులు ఉన్నారు. వారిని ప్రభుత్వం తగిన సౌకర్యాలతో ఆదుకోవాలి. రైతు బరోసా పేరుతో ఎన్నికల్లో తమ ప్రజాప్రతినిధులు గెలుపుకు సహరించిన ఉద్యోగులకు, మోతుబరి రైతులకు ప్రభుత్వం ఉపకారం చేస్తున్నట్లుగా అనిపిస్తున్నది. ఓట్లు వేసే ప్రజలు, వారి బిడ్డలు విద్యార్థులుగా ఉన్నత విద్య పొందడానికి బ్యాంకుల రుణాలు, వడ్డీ వ్యాపారులనుంచి అధిక వడ్డీలకు రుణాలు పొందుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం గమనించాలి. యువత నిరుద్యోగులుగా మారుతున్నారని, కొంత మంది చెడువ్యసనాల బారిన పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని పెట్టాలి. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు, యువత నిరుద్యోగులు గానే జీవితం చాలించకుండా తగిన చట్టాలను తయారు చేసి ఉత్తమ యువతను కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వంను కోరుతున్నాను. అవరం లేని పథకాలతో తెలంగాణ రాష్ట్రకు కలిగే వేలదికోట్ల రూపాయల నష్టమును తక్షణమే ప్రభుత్వం నిలిపివేయాలని, ఆ ప్రయత్నంలో విద్యార్థులు, యువత ఉండాలి



## వెలిచాల పల్లె దవాఖానకు ఎన్క్వాస్ ఉత్తమ దవాఖాన అవార్డు

**ప్రజాతీర్పు ప్రతినిధి, రామడుగు జూన్ 17**

రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెలిచాల పల్లె దవాఖాన ఎన్క్వాస్ (ఎన్ క్యూ ఏ ఎస్) నాణ్యతా ప్రమాణాల పరిశీలనలో ఉత్తమతను సాధించి రాష్ట్ర స్థాయి ఉత్తమ పల్లె దవాఖాన అవార్డును గెలుచుకునట్టు రామడుగు వైద్యాధికారి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10న నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్ క్యూ ఏ ఎస్) బృందం, నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ (ఎన్ హెచ్ ఎస్ ఆర్ సి) మార్గదర్శకాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించింది. ఈ పరిశీలనలో రాష్ట్రం మొత్తం 5 పల్లె దవాఖానలకు నాణ్యత సర్టిఫికెట్ తో పాటు ఉత్తమ అవార్డులు లభించగా, వాటిలో రామడుగు మండలంలోని వెలిచాల పల్లె దవాఖాన 90.55 శాతం మార్కులతో ఎంపిక కావడం గర్వకారణంగా మారిందన్నారు. ఈ సందర్భంగా రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఈ అవార్డు మన ఆరోగ్య కేంద్రం సేవల నాణ్యతకు లభించిన గుర్తింపు అని, ఇది అందరి కృషికి ఫలితమని తెలిపారు.

## శ్రీరామ కాలనీ జేఏసీ చైర్మన్గా కపిల్ గౌడ్ (వివేకానంద గౌడ్) ఎంపిక

**(మహేశ్వరం నియోజకవర్గం ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)... తేదీ జూన్ 17:**



మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధి శ్రీరామ కాలనీలో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీలో చైర్మన్గా మాజీ ఎంపీటీసీ కపిల్ గౌడ్ (వివేకానంద గౌడ్)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కపిల్ గౌడ్ మాట్లాడుతూ:-శ్రీరామ కాలనీ ఏర్పడిన నాలుగు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ అభివృద్ధి పరంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. కాలనీలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, డ్రైనేజ్,రోడ్లు,లైటింగ్ వంటి అంశాల్లో పురోగతి సాధించేందుకు ఈ జేఏసీ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. జూన్ 21 శనివారం రోజున కమిటీ సభ్యుల ఎంపిక జరగనున్నట్లు పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధి కోసం ప్రతి నివాసదారుడి భాగస్వామ్యంతో పని చేస్తామని,ఎక్స్ ఆర్మీ వాసు బాబు సూచనలతో అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజలకు ఉపయుక్తమైన కార్యక్రమాలు చేపడతామని చైర్మన్ కపిల్ గౌడ్ తెలిపారు.

## సీ.ఎం. రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎం.పి.టీ.సి

**(ప్రజాతీర్పు ప్రతినిధి జమ్మికుంట): జూన్ :17: మంగళవారం:**



రైతుబంధు నిధులు విడుదల చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన, మాజీ ఎం.పీ.టీ.సీ వాసాల రామస్వామి. ఈ.సందర్భంగా మాట్లాడుతూ.. ఎకరాలతో సంబంధం లేకుండా రైతులు సాగు చేసిన అన్ని ఎకరాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సీ.ఎం రేవంత్ రెడ్డి, పంటకు ఎకరాకు (6) వేలు చొప్పున సోమవారం రైతు నేస్తం కార్య క్రమంలో పాల్గొని, రైతు బంధు నిధులు విడుదల చేయడం పట్ల దన్యవాదాలు తెలుపుతున్నా అని జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు, తనుగుల తాజా మాజీ ఎం.పీ.టీ.సీ వాసాల రామస్వామి అన్నారు. .ప్రస్తుత పంట సాగు ప్రారంభించిన రాష్ట్ర వ్యాప్త రైతులకు ఈ పెట్టుబడి సహాయం ఎంతో లబ్ధి చేకూరుతుందని రామస్వామి అన్నారు.



## నరేంద్ర మోడీ.పరిపాలన దేశానికి శ్రీరామరక్ష....

**(ప్రజా తీర్పు ప్రతినిధి జమ్మికుంట): జూన్ :17: మంగళవారం:**

జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు అధ్యక్షతన మంగళవారం రోజున వారం జమ్మికుంట పట్టణంలోని (23).వ వార్డు మురళి టాకీస్ భారత ప్రధానమంత్రి. నరేంద్రమోడీ ( 11) ఏళ్ళ సంకల్ప సభ నిర్వహించారు, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి.జె.పి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి హాజరైయ్యారు, ఈ సందర్భంగా. కొలకాని రాజు, నాగేశ్వర్ రెడ్డి. లు మాట్లాడుతూ... మోడీ ప్రభుత్వం (11) సంవత్సరాల పాలనలో ప్రపంచంలోనే అతిపెద్ద (4).వ ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, కరోనా కాలం నుండి ఉచిత రేషన్ బియ్యం దేశ ప్రజలకు ఇస్తుందని, ఇప్పుడు రానున్న వర్షాకాలం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఒకేసారి మూడు నెలల ఉచిత రేషన్ బియ్యం ఇస్తున్నారని, దేశంలో పేద ప్రజలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం కింద ఇళ్లు కట్టించి ఇస్తున్నారని, మన తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కూడా ఉందని తెలిపారు, రైతులకు ప్రధానమంత్రి కిసాన్ పథకం ద్వారా సంవత్సరానికి ఆరు వేల రూపాయలు, దేశం, దేశ భద్రతకు తొలి ప్రాధాన్యత ఇస్తూ సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుని, వాటిని అమలు చేయడం కేవలం మోడీ కే సాధ్యామని అన్నారు, ఆర్టికల్ (370 )మరియు (35).ఎ. రద్దు చేయడం ద్వారా భారత రాజ్యాంగ వ్యవస్థలో పూర్తిగా భాగమైన జమ్మూ కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ రద్దు, పెద్ద నోట్ల రద్దు, మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియా ద్వారా దేశంలో సరికొత్త ఇండస్ట్రీ పాలసీ తీసుకువచ్చి స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధ విమానాలు, అణు ఉత్పత్తి, ఆయుధాల తయారీ తో దేశానికి శ్రీరామరక్ష గా పరిపాలన సాగిస్తున్నారని, కరోనా వాక్సిన్, అయోధ్య రామ మందిరం, బులెట్ ట్రైన్, వందే భారత్ రైల్లు, పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహకం అందిస్తుంది, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కాశ్మీర్ పాహల్గామ్ లో భారతీయ హిందువులను మతం అడిగి మరీ చంపిన చర్యను యావత్ భారత దేశం ముక్తకంఠంతో ఖండించిందని, నరేంద్ర మోడీ ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్ లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి, వందల మంది ఉగ్రవాదులను మట్టుబెట్టారని కేవలం ఒక ఆపరేషన్ సింధూర్ కే భయపడి పాకిస్థాన్ మన దేశ సైనికులతో కాల్పులు విరమణకు సహకరించాలని ప్రాధేయపడిందని గుర్తు చేశారు, ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు ఎర్రబెల్లి సంపత్ రావు, గుర్రాల వెంకట్ రెడ్డి, ఆకుల రాజేందర్, శీలం శ్రీను, జీడి మల్లేష్, బచ్చు శివన్న, పల్లపు రవి, కైలాసకొటి గణేష్, మోడం రాజు, మోతె స్వామి, కొమ్ము అశోక్, బూరుగుపల్లి రాము, రాచపల్లి ప్రశాంత్, శ్రీవర్ధి అఖిల్, యాంసాని సమ్మయ్య, నిరుపరాణి, కేస స్వరూప స్వరూప, కొండ్ర సులోచన, కనుమల్ల లక్ష్మి, రాంపెల్లి రజిత, తిరుమల, శోభ, అప్పాల రవిందర్, కురిమిల్ల అశోక్, కొండపర్తి ప్రవీణ్, పొనగంటి రవి, ఉడుగుల మహేందర్, ముకుంద సుధాకర్ పాల్గొన్నారు



## పుత్తడి ప్రియులకు గుడ్‌న్యూస్.. ఒకేరోజు ఏకంగా ఎంత ధర తగ్గిందంటే..?

బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఆభరణాల వ్యాపారులు, స్టాకిస్టులు అమ్మకాలతో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర ఒకే రోజు రూ.1200 తగ్గింది. తులం రూ.1,00,170కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల గోల్డ్ సైతం రూ.1,100 తగ్గి తులం రూ.99,450కి చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. అయితే, వెండి ధర రూ.100 పెరిగి కిలోకు రూ.1,07,200కి చేరుకున్నది. ప్రపంచవ్యాప్తంగా.. స్పాట్ బంగారం ఔన్సుకు 3,380.65కి తగ్గింది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ వెండి 0.44 శాతం పెరిగి ఔన్సుకు 36.47కి చేరుకుంది. ఇజ్రాయెల్‌-ఇరాన్ ఉద్రిక్తతలపై కాల్పుల విరమణకున్న అవకాశాల నేపథ్యంలో బంగారు వ్యాపారుల్లో సెంటిమెంట్‌ని పెంచిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతకు దౌత్యపరమైన పరిష్కారాల కోసం ఇరాన్ ప్రయత్నిస్తున్నందని పలు నివేదికలు తెలిపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. బంగారం ధర తగ్గుముఖం పడుతోందని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి తెలిపారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశానికి ముందు రోజు గరిష్ట స్థాయి నుంచి వెండి ధరలు తగ్గాయని కల్రాంతి పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బంగారం ధరలు పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. యూఎస్ ఆర్థిక వ్యవస్థను అంచనా వేయడానికి పెట్టిబడిదారులు మే నెలలో రిటైల్ అమ్మకాలు, పారిశ్రామిక ఉత్పత్తి డేటాతో సహా యూఎస్ మైక్రో డేటాను గమనిస్తున్నారని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా పేర్కొన్నారు.



## పుత్తడి ప్రియులకు గుడ్‌న్యూస్.. ఒకేరోజు ఏకంగా ఎంత ధర తగ్గిందంటే..?

బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఆభరణాల వ్యాపారులు, స్టాకిస్టులు అమ్మకాలతో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర ఒకే రోజు రూ.1200 తగ్గింది. తులం రూ.1,00,170కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల గోల్డ్ సైతం రూ.1,100 తగ్గి తులం రూ.99,450కి చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. అయితే, వెండి ధర రూ.100 పెరిగి కిలోకు రూ.1,07,200కి చేరుకున్నది. ప్రపంచవ్యాప్తంగా.. స్పాట్ బంగారం ఔన్సుకు 3,380.65కి తగ్గింది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ వెండి 0.44 శాతం పెరిగి ఔన్సుకు 36.47కి చేరుకుంది. ఇజ్రాయెల్‌-ఇరాన్ ఉద్రిక్తతలపై కాల్పుల విరమణకున్న అవకాశాల నేపథ్యంలో బంగారు వ్యాపారుల్లో సెంటిమెంట్‌ని పెంచిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతకు దౌత్యపరమైన పరిష్కారాల కోసం ఇరాన్ ప్రయత్నిస్తున్నందని పలు నివేదికలు తెలిపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. బంగారం ధర తగ్గుముఖం పడుతోందని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి తెలిపారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశానికి ముందు రోజు గరిష్ట స్థాయి నుంచి వెండి ధరలు తగ్గాయని కల్రాంతి పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బంగారం ధరలు పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. యూఎస్ ఆర్థిక వ్యవస్థను అంచనా వేయడానికి పెట్టిబడిదారులు మే నెలలో రిటైల్ అమ్మకాలు, పారిశ్రామిక ఉత్పత్తి డేటాతో సహా యూఎస్ మైక్రో డేటాను గమనిస్తున్నారని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా పేర్కొన్నారు.

# ప్రజా తీర్పు కథనానికి స్పందించిన ఫుడ్ ఇన్స్పెక్టర్

- రైస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ లో ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు
- ట్రేడ్ లైసెన్స్ కూడా లేకుండా నిర్వహిస్తున్న రైస్ గ్రాండ్ రెస్టారెంట్
- శాంపిల్స్ సేకరించిన అధికారులు.. 14 రోజుల తర్వాత రానున్న రిపోర్ట్స్
- సంఘటన జరిగిన వెంటనే శాంపిల్స్ సేకరిస్తే బాగుండేదంటున్నా ప్రజలు
- ఏది ఏమైనాఅప్పటికి 14 రోజులు వేచి చూడాల్సిందే



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 17**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సెంట్ మేరీస్ స్కూల్ ఎదురు పోస్ట్ ఆఫీస్ వద్ద నేషనల్ హైవే ఆనుకొని రైస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ కు అనుమతులు లేకుండా రుచి, శుచి, శుభ్రత పాటించకుండా భోజన ప్రియులకు కుళ్లిన ఆహార పదార్థాలు వడ్డిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న రైస్ గ్రాండ్ హోటల్ నిర్వాకంపై ప్రజా తీర్పు దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు.సోమవారం ఆ రెస్టారెంట్లో ఫుడ్ ఇన్స్పెక్టర్ రెండు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. శాంపిల్సు సేకరించి కల్తీ ఆహార పదార్థాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సేకరించిన నమూనాలు ల్యాబ్ కు పంపించి పరీక్షలు నిర్వహిస్తామని, 14 రోజుల తర్వాత వాటికి సంబంధించిన రిపోర్టులు వస్తాయని అనంతరం వాటిని ఉన్నతాధికారులకు అందజేస్తామని నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చినట్లు రుజువైతే ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకు అవసరమైతే హోటల్ ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. ఈ హోటల్ పై గతంలోనూ అనేక ఆరోపణలు వెల్లువెత్తాయని, ఇటీవల ఓ మహిళ కుటుంబం కల్తీ ఆహార పదార్థాలు భుజించినట్లు ఫిర్యాదు చేసిందని, మరో సారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని హెచ్చరించినట్లు ఫుడ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. తాజాగా తీసుకున్న శాంపిల్స్ ఫలితాలు 14 రోజుల్లో వెల్లడవుతాయని, ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటించారు. ట్రేడ్ లైసెన్సు కచ్చితంగా ఉండాలని రైస్ గ్రాండ్ హోటల్ కు లేకపోవడంతో కచ్చితంగా ఉండాలని రైస్ గ్రాండ్ యజమానియానికి హెచ్చరించినారు. హోటల్ పెట్టాలంటే ఎటువంటి అనుమతులు ఉండాలని ప్రజా తీర్పు దినపత్రిక ప్రతినిధి ఫుడ్ ఇన్స్పెక్టర్ ని అడగడంతో ఫుడ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ముందుగా హోటల్ ప్రారంభించాలంటే జీఎస్టీ హోటల్కుండాలని ట్రేడ్ లైసెన్స్ కూడా ఖచ్చితంగా ఉండాలని రైస్ బ్రాండ్ హోటల్ కు ట్రేడ్ లైసెన్స్ లేకపోవడంతో ఆగ్రహించిన ఫుడ్ ఇన్స్పెక్టర్.. దీనితో సర్ది చెప్పే ప్రయత్నం చేసిన హోటల్ రెస్టారెంట్ యాజమాన్యం.. మరి ట్రేడ్ లైసెన్సు లేకుండా ఎలా నడిరోడ్డుపై అక్రమంగా రెస్టారెంట్ నిర్మించి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికీ ఒక అధికారి కూడా స్పందించకపోవడం శోచనీయం. మరి ఇప్పటికైనా కార్పొరేషన్ కమిషనర్ స్పందించి ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న రెస్టారెంట్ పై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రేడ్ లైసెన్స్ కూడా లేకుండా నిర్వహిస్తున్న రెస్టారెంట్ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 17,**



జిల్లా రహదారులపై ప్రమాదాలు జరగకుండా సమగ్రమైన రహదారి భద్రత ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా ఎస్ పి రోహిత్ రాజు తో కలసి రహదారి భద్రతపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో ఆ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ఈ నెల చివరి నాటికి రహదారులపై ఉన్న గుంతలు అన్ని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ చికిత్స నిమిత్తం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తరపున ప్రణాళిక రూపొందించాలని డీఎంహెచ్‌వో ను ఆదేశించారు. ముందుగా జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి కి వెళ్లి రహదారి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న గుర్తించిన ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు గల కారణాల పై అధ్యయనం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా తక్షణమే ఆసుపత్రుల కు తీసుకెళ్లేందుకు అవకాశం ఉన్న దగ్గరి రహదారులు, హాస్పిటళ్లను ఎంపిక చేయాలని తెలిపారు. అదేవిధంగా అంబులెన్స్‌లు, ట్రామా కేంద్రాలపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రామవరం ట్రామా కేర్ కేంద్రం నిర్మాణ పనులను త్వరితగతిగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం లో సిపిఆర్ మానిక్యూర్ కిట్లు అందుబాటులో ఉంచాలని, సిబ్బందికి సిపిఆర్ పై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.ప్రమాదాలు సంభవించకుండా రహదారులపై సైన్ బోర్డులతో పాటు, రేడియం స్టిక్కర్లు, జీబ్రాలైన్లు, స్టాపేజీలు వంటి వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో మోటార్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువ గా జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశంలో గుర్తించి వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని. కళాశాలలు మరియు పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని రహదారుల్లో ప్రమాదకరమైన మలుపుల వద్ద అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్ళలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద బజార్ మరియు చిన్న బజార్ ప్రాంతాలలో పార్కింగ్ కొరకు అనువైన స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు.రహదారుల్లో ప్రమాదాల నియాత్రలకు అన్ని శాఖలు సమన్వయం గా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం రహదారి భద్రతపై రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్,జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్బీఐ డెడ్‌లైన్‌కు ముందే.. ఏటీఎమ్‌లలో పెరిగిన రూ.100, రూ.200 నోట్ల లభ్యత

ఏటీఎమ్‌లలో (%ూువీం%) రూ.100, రూ.200 నోట్ల లభ్యత పెరిగింది. ప్రజలకు రూ.100, రూ.200 నోట్లు మరింత అందుబాటులో ఉండేలా ఏటీఎమ్‌లలో ఆయా డినామినేషన్ నోట్ల (%ంవఅశీఎఱఅఱశీఅ ఋబతీశీవఅఎం%) లభ్యతను పెంచాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) ఇటీవలే ఆదేశించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 30 నాటికి ఈ నోట్ల లభ్యత పెంచాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసింది. దశల వారీగా ఈ ఆదేశాలను అమలు చేయాలని బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎమ్ ఆపరేటర్లకు సూచించింది. ఈ మేరకు 2025 సెప్టెంబర్ 30 నాటికి 75 శాతం ఏటీఎమ్‌లలో కనీసం ఒక్క క్యాసెట్‌లోనైనా రూ.100 లేదా రూ.200 నోట్లు ఉండేలా చూడాలని డెడ్‌లైన్ పెట్టింది. అంతేకాదు 2026 మార్చి 31 నాటికి దీన్ని 90 శాతం పెంచాలని పేర్కొంది. ఆర్బీఐ ఆదేశాలకు అనుగుణంగా డెడ్‌లైన్‌కు ముందే రూ.100, రూ.200 నోట్ల లభ్యత 70 శాతానికిపైగా పెరగడం విశేషం. గతేడాది డిసెంబర్‌లో 65 శాతంగా ఉన్న ఈ నోట్ల లభ్యత ప్రస్తుతం 73 శాతానికి చేరింది. దేశంలోనే అతిపెద్ద నగదు నిర్వహణ సంస్థ అయిన సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ (%జవీు ×అటశ ూఎర్వఎం%) ఈ గణాంకాలను వెల్లడించింది. ఈ సంస్థ దేశంలోని మొత్తం 2,15,000 ఏటీఎమ్‌లలో 73,000 ఏటీఎమ్‌లను నిర్వహిస్తోంది.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్ జూన్ 17,**



గోదావరి వరదలు వల్ల ప్రజలకు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో గోదావరి వరదలపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మరియు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రతి అధికారి వాహనంలో లైఫ్ జాకెట్లు,టార్చి లైటు, తాడు, హ్యాండ్ మైకు, అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు ఫ్లడ్ మేనేజ్మెంట్ ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. వరద ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ముంపుకు గురయ్యే వరకు వేచి ఉండకుండా ముందస్తుగానే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. వరదల నుండి ప్రజలను కాపాడేందుకు గ్రామస్థాయి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సన్నాహక సమావేశంలో దిశానిర్దేశం చేసిన అంశాల పట్ల అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. వరదల్లో చిక్కుకున్న వ్యక్తులను రక్షించేందుకు లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, నాటుపడవలు, బోట్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రానున్న మూడు నెలల వరకు అనగా అక్టోబర్ మాసం వరకు సరిపోను అన్ని రకాల నిత్యావసర వస్తువులు స్టాకు ఉంచాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. వరద ముంపు చర్యలు పర్యవేక్షణకు సెక్టోరియల్, జోనల్ అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. వరద యొక్క సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు ముంపు గ్రామాల ప్రజల ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా పంచాయతీరాజ్, విద్యుత్తు శాఖ అధికారులు ముందస్తుగానే ముంపు గ్రామాల్లో పరిశీలన చేయాలని చెప్పారు. ముంపుకు గురయ్యే అవకాశాలున్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టి విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. అత్యవసర సేవలకు హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవడానికి అనుగుణంగా హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని రహదారులు భవనాల శాఖ అధికారులకు సూచించారు. అత్యవసర సేవలు కొరకు మొబైల్ సెట్లు వినియోగించేందుకు సెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గోదావరికి పై నుండి వచ్చే వరద సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేస్తుండాలని చెప్పారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు విషయంలో ప్రాధాన్యతలను తెలియచేయడంతో పాటు ఇబ్బందులు రాకుండా ముందస్తుగానే ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కిన్నెరసాని వంటి ప్రాజెక్టులు గేట్లు ఎత్తు సమయంలో ప్రభావిత ప్రాంతాలకు ముందస్తుగా తెలియజేయు విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారాన్ని తయారు చేసేందుకు వంట చేసే సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని చెప్పారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేయు చేయు విధంగా ఫ్లడ్ కంట్రోల్ రూము ఏర్పాటుతో పాటు మండల, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని చెప్పారు. వరదల సమయంలో గర్భిణి మహిళలు ఇబ్బందులు. పడకుండా ముందస్తు జాబితాను సిద్ధం చేసి సమీపంలోని ఆసుపత్రుల్లో చేర్పించు విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో ఈడీ క్యాలెండర్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు.వైద్య శాఖ 108 అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని, సిబ్బందికి ప్రమాదం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, ప్రాథమిక వైద్యం పై శిక్షణ నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.వరదల సమయంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతుంటాయని ప్రజలు దాటే ప్రయత్నం చేయకుండా బారికేడింగ్ చేయాలని చెప్పారు. వాగులు దాటించడం వల్ల ప్రజలతో పాటు పశువులు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయని, కాబట్టి ముందస్తుగానే సమాచారం ప్రజలకు చేరవేసి రక్షణ చర్యలు పాటించు విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వరదల సమయంలో అత్యవసర వైద్యసేవలకు అంతరాయం లేకుండా మందులను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పాము, తేలు కాటు వంటి విష జంతువులకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని, వ్యాక్సిన్ అందక ఎటువంటి ప్రాణ నష్టం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులకు తెలిపారు . సింగరేణి, కేటిపిఎస్, ఐటిసి, నవభారత్ తదితర సంస్థల రెస్క్యూ టీముల సేవలు వినియోగించుకునేందుకు జాబితా అందుబాటులో ఉంచాలని చెప్పారు. వర్షాకాలంలో పశువులు వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయు కార్యక్రమాలను చేపట్టాలని పశుసంర్ధక అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో పశువులు ప్రమాదాలకు గురి కాకుండా వాటిని పెద్ద తాడుతో కట్టివేసించాలని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గుత్తికోయ ఆవాసాల్లో పర్యటించి ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. లయింగ్ ఏరియాల్లో నీటి నిల్వలు లేకుండా డ్రెయిన్లు పరిశు భ్ర పరచడం, డ్రైయిన్లు నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని చెప్పారు. విస్తా కాంప్లెక్సు, అశోక్ నగర్ నీటి నిల్వలు లేకుండా ఎత్తిపోసేందుకు మోటార్లను అందుబాటులో ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వరదనీరు నిల్వ లేకుండా వెళ్లేందుకు డ్రెయిన్లను పరిశుభ్రం చేయాలని చెప్పారు. నీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న ప్రాజెక్టులు వాటి యొక్క గేట్ల మరమ్మత్తులను తక్షణమే పూర్తి చేయాలని, వాటి యొక్క పనితీరును పరిశీలించి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని బ్లీచింగ్, సోడియం హైపో క్లోరైడ్ ద్రావణాన్ని స్ప్రే చేయించాలని చెప్పారు. మంచినీరు సఫరాకు ఇబ్బంది రాకుండా చూడాలని నీటి వనరులు ముంపుకు గురైతే మంచినీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా ప్రత్యాన్మయ చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. 73 అడుగులు గోదావరి వరదలు వచ్చినప్పటికీ ఎదుర్కొనే విధంగా అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి మరియు పంచాయతీరాజ్ అధికారులు తమ పరిధిలోని లోవర్ బ్రిడ్జిలను గుర్తించి ప్రణాళికలు అందించాలని ఆదేశించారు. అన్ని లో లెవెల్ బ్రిడ్జిలు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు 15 లోపు తూర్పాక హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పరిధిలోని మంజూరు అయిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ అధికారులు కెనాల్, ప్రాజెక్టుల వద్ద సుబాబులు మరియు సిస్సు మొక్కలను విస్తృతంగా నాటాలన్నారు. అధికారులందరూ కార్య స్థానం విడిచి వెళ్లరాదని క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.విధి నిర్వహణలో అలసత్వం వలన ఏ ఒక్క ప్రాణ నష్టం జరిగినా సంబంధిత అధికారుల పైన కఠిన చర్యలు ఉంటాయని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ.. ధర్తీధన్ భాగీదారీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు ఆధార్ కార్డ్ నమోదులు మరియు నవీకరణలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ జారీ, జన్ ధన్ బ్యాంక్ ఖాతాలు తెరవడం, పి ఎం-కిసాన్ యోజన నమోదులు, పెన్షన్ పథకాల నమోదులు, స్కాలర్‌షిప్‌లు, బీమా పథకాలు, నైపుణ్య శిక్షణ, జీవనోపాధి కార్యక్రమాల నమోదు వంటి కీలకమైన ప్రభుత్వ సేవలను పొందేందుకు గ్రామం మరియు నివాస శిబిరాలను 15 రోజులపాటు నిర్వహించాలన్నారు. ఈ శిబిరాల ద్వారా అర్హత కలిగిన ఏ ఒక్క గిరిజన కుటుంబాన్ని వదిలి పెట్టకుండా అందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, అన్ని శాఖల అధికారులు మరియు పాల్గొన్నారు.



## నజ్ముల్, ముష్ఫీకర్ శతక జోరు.. బంగ్లాదేశ్ 292/3

గాలె: కెప్టెన్ నజ్ముల్ హొసేన్ శాంతో (136 నాటౌట్, 14 ఫోర్లు, 1 సిక్స్), సీనియర్ బ్యాటర్ ముష్ఫీకర్ రహీమ్ (105 నాటౌట్, 5 ఫోర్లు) అజేయ శతకాలతో చెలరేగడంతో గాలె వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ మొదటి రోజే అదరగొట్టింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌లో భాగంగా శ్రీలంకతో మంగళవారం మొదలైన తొలి టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్.. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసింది. 45 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన బంగ్లాను నజ్ముల్, రహీమ్ ఆదుకున్నారు. ఈ ఇద్దరూ లంక బౌలర్ల దాడిని సమర్థవంతంగా అడ్డుకోవడమే గాక అజేయమైన నాలుగో వికెట్‌కు 247 పరుగులు జోడించి ఆ జట్టును భారీ స్కోరు దిశగా తీసుకెళు_న్నారు. లంక అరంగేట్ర స్పిన్నర్ తరిందు రత్నయకె (2/124) ఆరంభంలోనే రెండు వికెట్లు తీసి పర్యాటక జట్టును ఒత్తిడిలోకి నెట్టినా ఆ తర్వాత అతడితో పాటు మిగిలిన బౌలర్లూ తేలిపోయారు.



## ప్రపంచకప్ తర్వాత వీడ్కోలు.. వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించిన సోఫీ డెవిన్

ఆక్లాండ్: న్యూజిలాండ్ మహిళల క్రికెట్ జట్టు సారథి సోఫీ డెవిన్ వన్డే ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. ఈ ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న వన్డే ప్రపంచకప్ తర్వాత ఆమె ఈ ఫార్మాట్ నుంచి తప్పుకోనుంది. ఈ మేరకు న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జెడ్‌సీ) ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇప్పటిదాకా 152 వన్డేలు ఆడిన 35 ఏండ్ల ఈ వెటరన్ ఆల్‌రౌండర్.. 3,990 పరుగులు చేసింది. ఇందులో 8 శతకాలు, 16 అర్ధ శతకాలున్నాయి. బ్యాట్‌తో పాటు బంతితోనూ రాణించిన డెవిన్.. 107 వికెట్లు తన ఖాతాలో వేసుకుంది. కివీస్ తరఫున అత్యధిక పరుగులు (వన్డేల్లో) చేసిన బ్యాటర్లలో నాలుగో స్థానంలో ఉన్న డెవిన్.. వికెట్ల విషయంలో రెండో స్థానంలో నిలిచింది.

# మంధాన ఏ1.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం

**మంధాన ఏ1.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. గత ఏడాదిన్నరకాలంగా ఈ ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తున్న మంధాన.. ఐసీసీ తాజాగా విడుదల చేసిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.**



భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. గత ఏడాదిన్నరకాలంగా ఈ ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తున్న మంధాన.. ఐసీసీ తాజాగా విడుదల చేసిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆరేండ్ల (చివరిసారిగా 2019లో) తర్వాత ఆమె అగ్రస్థానానికి చేరుకోవడం ఇదే తొలిసారి. 727 రేటింగ్ పాయింట్లతో మంధాన మొదటి స్థానంలో నిలవగా ఇంగ్లండ్ సారథి సీవర్ బ్రంట్ 719 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ 719 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. మంధాన తర్వాత భారత్ నుంచి జెమీమా రోడ్రిగ్స్ (14), హర్మన్‌ప్రీత్ (15) మాత్రమే టాప్-20లో చోటు దక్కించుకున్నారు. వన్డేలలో మొదటి స్థానాన ఉన్న మంధాన.. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానంలో ఉంది.

# సూపర్ ట్రిపుల్.. మూడో సూపర్ ఓవర్‌లో తేలిన ఫలితం

## టీ20 చరిత్రలో సరికొత్త రికార్డు



గ్లాస్గో (స్కాట్లాండ్): ధనాధన్ క్రికెట్‌లో సంచలనం నమోదైంది. నెదర్లాండ్స్, నేపాల్ మధ్య సోమవారం రాత్రి ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన టీ20 మ్యాచ్ మొదట టై అవగా ఆ తర్వాత ఒక్కటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడో సూపర్ ఓవర్‌లో ఫలితం తేలింది. పొట్టి క్రికెట్‌లో ఒక మ్యాచ్‌లో మూడో సూపర్ ఓవర్ ద్వారా ఫలితం రావడం ఇదే ప్రథమం. వివరాల్లోకెళ్తే.. నెదర్లాండ్స్, నేపాల్ మధ్య గ్లాస్గోలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన డచ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 152/7 పరుగులు చేసింది. ఛేదనలో నేపాల్ విజయానికి చివరి ఓవర్‌లో 17 రన్స్ అవసరమవగా ఆ జట్టు 16 పరుగులే చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. తొలి సూపర్ ఓవర్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన నేపాల్.. 19 రన్స్ చేసింది. బదులుగా నెదర్లాండ్స్ కూడా అన్నే పరుగులు చేయడంతో రెండో సూపర్ ఓవర్ ఆడాల్సి వచ్చింది. ఈసారి డచ్ జట్టు నేపాల్ ఎదుట 18 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. కానీ నేపాల్ కూడా 17 పరుగుల వద్దే ఆగిపోవడంతో మూడో సూపర్ ఓవర్ అనివార్యమైంది. అయితే నెదర్లాండ్స్ బౌలర్ జాచ్ లయాన్.. నాలుగు బంతుల్లోనే ఇద్దరు నేపాల్ బ్యాటర్లను ఔట్ చేశాడు. విజయానికి ఒక పరుగు అవసరమైన దశలో లెవిట్.. తొలి బంతికే భారీ సిక్సర్ బాది ఈ ఉత్కంఠ పోరుకు తెరదించాడు.




# పూరి సినిమాలో సంయుక్త

పూరి సినిమాలో సంయుక్త లైగర్, డబుల్ ఇస్మార్ట్ చిత్రాల అనుభవాలను పాఠాలుగా చేసుకొని, తన కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి ఓ భిన్నమైన కథ రాసుకున్నారు అగ్ర దర్శకుడు పూరీ జగన్నాథ్. కథతోపాటు పాత్రల ఎంపిక విషయంలో కూడా ఆయన విభిన్నంగా వెళ్తున్నారు. లైగర్, డబుల్ ఇస్మార్ట్ చిత్రాల అనుభవాలను పాఠాలుగా చేసుకొని, తన కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి ఓ భిన్నమైన కథ రాసుకున్నారు అగ్ర దర్శకుడు పూరీ జగన్నాథ్. కథతోపాటు పాత్రల ఎంపిక విషయంలో కూడా ఆయన విభిన్నంగా వెళ్తున్నారు. ఇప్పటికే కథానాయకుడిగా తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతిని తీసుకున్నారు. సీనియర్ నటి టబుని ఓ కీలక పాత్రకు ఎంపిక చేశారు. రీసెంట్‌గా ఈ ప్రస్టేజియస్ ప్రాజెక్ట్‌లోకి లక్కీ హీరోయిన్ సంయుక్త మీనన్ వచ్చి చేరింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. చిత్ర బృందం ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ పెట్టింది. 'అమె నడకలో హుందాతనం.. కళ్లల్లో ఆగ్రహం..' అంటూ సంయుక్తకు స్వాగతం పలుకుతూ ఆమెతో కలిసి పూరీ, ఛార్మీ దిగిన ఫొటోను ఈ పోస్ట్‌లో పంచుకున్నారు. బాలీవుడ్ నటి రాధిక ఆప్టేని ఈ సినిమాలో ఎంపిక చేసినట్టు గతంలో వార్తలొచ్చాయి. ఇప్పుడు ఆమె స్థానంలోనే సంయుక్త మీనన్‌ని తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ చిత్రానికి 'బెగ్గర్' అనే టైటిల్ ముందు అనుకున్నారు. తాజాగా 'భిక్షాందేహి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు.

## ఇన్‌స్పైర్ చేసే మాటలతో యూత్‌ని తనవైపుకు తిప్పుకుంటున్న దిశా పాట్ని





# ధనుష్ డైరెక్షన్ లో పవర్‌స్టార్.. సెట్స్ మీదకు వెళ్లేదెప్పుడు ??

చెప్పే సమయాన్ని మనుషులను బట్టి విషయం విలువే మారిపోతుంది నీలాంబరి అంటూ త్రివిక్రమ్ రాసిన డైలాగ్ గుర్తుందా? ఇప్పుడు కుబేర ఈవెంట్‌లో ధనుష్ మాటలు విన్నవారందరూ ఈ డైలాగులనే గుర్తుచేసుకుంటున్నారు. అయితే పవన్ కల్యాణ్‌తో లింకు పెట్టి మరీ మాట్లాడుకుంటున్నారు. తెలుగులో తనకు ఓ సినిమా డైరక్ట్ చేయాలని ఉందని, అది కూడా పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కించాలని ఉందనీ ఓపెన్ అయ్యారు ధనుష్ తెలుగులో తనకు ఓ సినిమా డైరక్ట్ చేయాలని ఉందని, అది కూడా పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కించాలని ఉందనీ ఓపెన్ అయ్యారు ధనుష్. తమిళ్‌లో తాను 51 సినిమాలు చేసినా, కుబేర తనకు తెలుగులో రెండో సినిమానే అని వినమ్రంగా చెప్పారీ స్టార్. కుబేర ఆడియో వేడుకలో ధనుష్ చెప్పిన మాటలు విన్నవారందరి దృష్టీ పవన్ కల్యాణ్ ఫిల్మోగ్రఫీ మీదకు మళ్లుతోంది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020